యథావిధిగా డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సోమవారం ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 08842357800 నెంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారిశుధ్య నిర్వహణపై పంచాయితీ

- నిధుల్లేక పంచాయతీల విలవిల
- విజృంభిస్తున్న విష జ్వరాలు
- పొంచి ఉన్న డెంగీ ముప్పు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రస్తుతం వర్షాకాలం సీజన్ నేపథ్యంలో పలు గ్రామాల్లో వర్షపు, మురుగునీరు నిల్వ ఉండిపోవడం వల్ల దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. వీటి వల్ల వ్యాధులు ముసురుతున్నాయి. విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. మరోవైపు డెంగీ జ్వర పీడితులు పెరుగుతున్నారు. పారిశుధ్యాన్ని మెరుగు పరచాల్సిన పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. చేసేదేమీ లేక సర్పంచులు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది.

కాకినాడ జిల్లా పెద్దాపురం డివిజన్‌లో 213 పంచాయతీలు, కాకినాడ డివిజన్లో 172 పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 385 పంచాయతీలుండగా మెజారిటీ గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో దోమలకు నిలయాలుగా మారాయి. పలు ప్రాంతాల్లో చెత్త కుప్పలు కూడా దర్శనమిస్తుండడంతో ప్రజలు రోగాలతో సతమతమవుతున్నారు. ప్రస్తుతం కండ్ల కలక అంటు వ్యాధి బాగా ఎక్కువగా ఉంది. దానికి తోడు సీజనల్ వ్యాధులు ముసురుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 62 డెంగీ కేసులు నమోదవగా ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఈ బాధితులు ఉన్నారు. వ్యాధులు ముసురుతున్న వేళ పలువురు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు.

వాకలపూడి మత్స్యకార సామాజిక భవనం వద్ద పరిస్థితి

నిధుల్లేక పంచాయతీలు విలవిల

పలు పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పారిశుధ్యం మెరుగుపరిచే విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తుంది. కాలువల్లో పూడిక, వ్యర్థాలు పేరుకుపోయాయి. దోమల నివారణ చర్యలు చేపట్టడంలో పంచాయతీ అధికారులు సిబ్బంది ఏమీ చేయలేని నిస్సహాయత స్థితిలో ఉన్నారు. మందులు పిచికారీ చేయడం లేదు. పలు గ్రామాల్లో ఫాగింగ్ ఊసే లేదు. 2022-23 గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నుంచి మొదటి విడతగా అన్ని పంచాయతీలకు రూ.26.75 కోట్లు నిధులు గత నెలలో జమ అయ్యాయి. వాస్తవానికి ఈ నిధుల నుంచి 30 శాతం సిబ్బంది జీతాలకు, 50 శాతం విద్యుత్ బిల్లులకు 20 శాతం శానిటేషన్ నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం తొలి విడతలో విడుదలైన నిధుల్లో రూ.6 కోట్ల 75 లక్షల 16 వేలు విద్యుత్ బిల్లులకు, రూ.7 కోట్ల 42 లక్షల 6 వేలు విద్యుత్ దీపాలు నిర్వహణకు ఎనర్జీ ఏపీషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఇఇ ఎస్-ఎల్)కు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. ఇంకా 12.57 కోట్లు మాత్రమే పంచాయతీ ఖాతాల్లో ఉన్నాయి. మిగిలి ఉన్న నిధులను సచివాలయాల నిర్మాణ పనుల్లో భాగంగా ప్రభుత్వం ఫినిషింగ్ వర్కుల నిమిత్తం వాడుతున్నారు. దీంతో పారిశుధ్య నిర్వహణ కష్టంగా మారింది. పారిశుధ్య నిర్వహణలో భాగంగా సిబ్బంది జీతాలు, బ్లీచింగ్, ముగ్గు, కాలువల్లో సిల్ట్ తొలగింపు తదితర పనులను కొన్ని పంచాయతీలు సాధారణ నిధుల నుంచి వినియోగిస్తున్నారు. సాధారణ నిధులు లేని పంచాయతీలు మాత్రం పారిశుధ్య నిర్వహణను గాలికి వదిలేసినట్లు ఆయా గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల గ్రామ సర్పంచులు ఆందోళన బాట పట్టి జిల్లా కలెక్టర్ల వినతి పత్రాలు అందించారు. సాధారణ నిధులు సరిపోని నేపథ్యంలో అనేక పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లకు, ఇతర సిబ్బందికి 6 నుంచి 9 నెలలు వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆర్థిక సంఘం నిధులను ఎక్కువగా పారిశుధ్య నిర్వహణకే ఖర్చు చేయాల్సి ఉంది. అయితే వాటిని రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్ళిస్తున్న తరుణంలో గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో చేసేదేమీ లేక కొన్ని పంచాయతీల్లో సర్పంచులు తమ సొంత సొమ్ములను వెచ్చించి పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. కొందరైతే అప్పులు చేసి నిర్వహిస్తున్నారు. సాధారణ నిధులను సైతం ఖర్చు చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని పలువురు సర్పంచ్ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ రూరల్ వలసపాకల శ్మశానం పక్కన పోగుబడిన చెత్త

నిధుల సమస్యలు లేదు

అన్ని పంచాయతీల్లోని పారిశుధ్య నిర్వహణకు నిధులు సమస్య ఏమీ లేదు. 15 ఆర్థిక సంఘం నుంచి నిధులు కొన్ని పంచాయితీలకు ఇప్పటికే జమ అయ్యాయి. సాధారణ నిధుల నుంచి కూడా శానిటేషన్ పనులకు సొమ్మును వినియోగించుకోవచ్చు.

- ఆర్.విక్టర్, డిపిఒ, కాకినాడ జిల్లా.

సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న వీర్రాజు, దొరబాబు

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

రాష్ట్ర ప్రభుత్వం అనేక వ్యయ ప్రయాసలకోర్చి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర హౌసింగు బోర్డు చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు పేర్కొన్నారు. సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవంలో రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన రైతుల కమర్షియల్ సొసైటీ భవనాన్ని ఆదివారం డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా హసింగ్ చైర్మన్ దొరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సిఎం వైఎస్ జగన్ రైతు పక్షపాతి అన్నారు. రైతుల సంక్షేమానికి చేస్తున్న కృషిని, ఇస్తున్న పథకాలను వివరించారు. మొదట కమర్షియల్ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రిబ్బన్ కత్తిరించి భవనాన్ని ఆకుల, దవులూరి ప్రారంభించారు. అనంతరం డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన దుకాణంలో దవులూరి దొరబాబు చీరలు కొనుగోలు చేసి 43 మంది మహిళా వాలంటీర్లకు బహూకరించారు. తొలుత గ్రామానికి వచ్చిన డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, హౌసింగు చైర్మన్ దవులూరి దొరబాబులకు సీనియర్ వైసీపీ నాయకులు, ఎంపిటీసీ మలకల సూర్యారావు (సూరిబాబు) ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఎంపిటిసి మలకల సూర్యారావు (సూరిబాబు), సొసైటీ అధ్యక్షుడు మలకల వరాలబాబు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కథా సాహిత్యంలో ధ్రువతార రావి శాస్త్రి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తెలుగు కథా సాహిత్యంలో ఒక ప్రభంజనం సృష్టించి అందరినీ ఆలోచింపచేసిన అభ్యుదయ కవి రాచకొండ విశ్వనాథ శాస్త్రి అని గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో రావిశాస్త్రి జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో నిత్యం పైతరగతి వారి అన్యాయాలకు, దౌర్జన్యాలకు గురై చిత్రహింసలు పడుతున్న దీన, హీన ప్రజల తరఫున తన ప్రతి రచనలోనూ వకాల్తా పుచ్చుకుని వాదించిన కవి రావిశాస్త్రి అని అన్నారు. మంచికి హాని, చెడ్డకు సహాయం చేయకూడదనేది ఆయన లక్ష్యమని అన్నారు. దగా పడ్డ జనం కోసం, చీకట్లు ముసిరిన బతుకుల కోసం ఆయన తుది శ్వాస వరకు అవిశ్రాంతంగా పోరాడారని చెప్పారు. 1922 జూలై 30న జన్మించిన రావిశాస్త్రికి కళా ప్రపూర్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించినా వాటిని తిరస్కరించారని సుబ్బారావు తెలిపారు. ఆయన స్ఫూర్తి చెరగనిదన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నేతలతో ముస్లిములు

సిఎం వైఎస్.జగన్‌కు ముస్లిముల కృతజ్ఞత

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్థానిక రమణయ్యపేట క్యాంప్ ఆఫీసులో మాజీ మంత్రి రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణను ముస్లిం సోదరులు ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ ముస్లిములకు హజ్ యాత్ర కోసం విజయవాడలో కేంద్రం ఏర్పాటు చేసి నేరుగా హజ్ యాత్ర చేసేందుకు రూ.14 కోట్ల 50 లక్షల సబ్సిడీని యాత్రికుల ఎకౌంట్లో వేసినందుకు ముఖ్యమంత్రి జగన్‌కు, ఎంఎల్ఎ కురసాల కన్నబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పలు మసీదుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. కాకినాడ రూరల్ మండలంలో ముస్లిములకు కమ్యూనిటీ హాల్ మదర్సాకు స్థలం ఏర్పాటు చేయాలని, శ్మశానానికి స్థలం కేటాయించాలని ముస్లిం పెద్దలందరూ వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ఎంఎల్ఎ కన్నబాబు స్పందించి తప్పకుండా కమ్యూనిటీ హాల్ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ మసీదు అభివృద్ధి పనులను పనులను పూర్తి చేస్తామని, వారికి ఏ సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ ఖాజీ గౌస్ మొహిద్దీన్ స్టేట్ వక్ఫ్ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, ఎస్ఎస్‌విటి. ట్రాన్స్‌పోర్ట్ అధినేత ఎస్‌కె.అహ్మద్, కరీం బాషా, కెజిఎన్.వలీ, లతీఫ్ ఖాన్, అల్తాఫ్, యాకూబ్, సమ్‌దాని బాషా, ఇస్మాయిల్, హుస్సేన్, రావూరి వెంకటేశ్వరరావు, లింగం రవి, ఎండి కాజా, మహమ్మద్ జానీ ఎండి గౌస్, డి.హుస్సేన్, ఎండి జాఫర్, మరియు ముస్లిం పెద్దలు జమాత్ పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం, స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కలెక్టరేట్ స్పందన హాల్లో జరుగుతుందని జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఆగస్టు 1న మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఆలయంలో కిక్కిరిసిన యాత్రికులు

మరిడమ్మ జాతరలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ జాతరకు ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు రావడంతో ఆలయ పరిసరాలన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహనరావు, అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో క్యూలైన్లలో యాత్రికులు గంటల తరబడి ఇబ్బందులు పడకుండా వేగవంతంగా దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ముమ్మన వెంకట ప్రకాశం, బైలపూడి సత్యనారాయణ, దాకారపు కామరాజు, చల్లా సత్యనారాయణ, దాకమిల్లి రమేష్, చీపురుపల్లి అరుణ, బొండాడ అప్పలరాజు సేవలందించారు. ఎస్ఐ వి.సురేష్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె రామారావు తెలిపారు. తొలుత 46 అంశాలతో కూడిన అజెండాపై చర్చ జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశానికి అందరు కౌన్సిలర్లు, అధికారులు హాజరుకావాలని చైర్‌పర్సన్ అరుణ కృష్ణమూర్తి కోరారు.

మణిపూర్ ఘటనలపై నిరసన

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి, కాకినాడ కార్పొరేషన్

మణిపూర్‌లో మహిళపై జరిగిన సంఘటనను నిరసిస్తూ ఉప్పాడలో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. అమీనాబాద్ నుంచి ఉప్పాడ, కొత్తపల్లి, వాకతిప్ప, కుతుడుమిల్లి మీదుగా వందలాదిగా ప్రజల పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి మణిపూర్‌లో దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో ఉప్పాడ, అమీనాబాద్, మాయాపట్నం, సుబ్బంపేట, తదితర గ్రామాల నుండి వేలాది సంఖ్యలో పాల్గొన్నారు

యు.కొత్తపల్లిలో ర్యాలీ

మణిపూర్ సంఘటనపై జనకవన గళం

సాహితీస్రవంతి, యుటిఎఫ్ ఆధ్వర్యాన కాకినాడ యుటిఎఫ్ హోమ్‌లో జనకవనం నిర్వహించాయి. సభకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రభాకరవర్మ అధ్యక్షత వహించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గనారా, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, గోవిందరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సాహితీ స్రవంతి నగరాధ్యక్షుడు జానకిరామ చౌదరి అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. ఆదీవాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం జరపడం యావద్దేశం సిగ్గుపడాల్సిన విషయమని ప్రభాకరవర్మ అన్నారు. ఇది పాలకులు కేవలం తమ ఉనికిని కాపాడుకొనేందుకు రెండుతెగల మధ్య రాజేసిన నిప్పు అని కృష్ణబాబు అన్నారు. గనారా మాట్లాడుతూ కుల మతాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే సంఘ విద్రోహుల కుట్రగా ఈ సంఘటనను అభివర్ణించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జనకవనంలో గరికపాటి మాస్టారు, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, మార్ని జానకి రామచౌదరి, మేడిశెట్టి శ్రీరాములు, గౌరినాయుడు, కొత్తశివ, అవధానుల మణిబాబు, నాగజ్యోతి, రత్నాజయ్, రమణ, ఉండవిల్లి, మాకినీడి, సీతారామరాజు, ఇంద్రగంటి, ఇబ్రహీం, జనార్ధనస్వామి, డాక్టర్ శిరీష, పలువురు సాహితీవేత్తలు తమ కవితలను వినిపించారు. పలువురు సాహితీవేత్తలు, నాయకులు పాల్గొన్నారు.

కాకినాడలో జనకవనం..

కార్టూ'నిజం'

ప్రభుత్వం మనల్ని గాలికొదిలేసిందిగా.. మనమూ అనాథల కిందే లెక్క..!!

అధ్వానంగా పారిశుధ్యం

ప్రజాశక్తి -రౌతులపూడి, కోటనందూరు

వర్షాకాలం వాతావరణంలో వచ్చిన మార్పులతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. అక్కడక్కడ డెంగీ కేసులు కూడా నమోదవుతున్నాయి. ప్రజారోగ్య రక్షణకు పారిశుధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరుగు కాలవల నిర్వహణ దాదాపు అటకెక్కింది. ప్లాస్టిక్ సీసాలు. గ్లాసులు కాలవలో ఎక్కడకక్కడ పేరుకుపోయాయియ. ఈ నేపథ్యంలో దోమల బెడద అధికమైంది. మండల కేంద్రమైన రౌతులపూడి, ములగపూడి, ఎ.మల్లవరం, ఎల్ఆర్.పాలెం. గిడజాం తదితర గ్రామాలలో మరుగు కాలవలు సక్రమంగా లేవు నడిచే దారిలోనే మరుగు పారుతోంది. మండలంలోని 26 పంచాయతీల్లోనూ పూర్తిస్థాయి పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. దీంతో రోగాల బారిన పడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్ల పూర్తిస్థాయి పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

రౌతులపూడిలో పూడుకుపోయి డ్రెయినేజీ

తుని పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తహశీల్దారు, సిల్దార్, ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, గృహ నిర్మాణ శాఖ ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట కూడలిగా ఉంటాయి. ఆయా కార్యాలయాలకు సుమారు 30 గ్రామాల ప్రజలు రోజు వందలాదిమంది వివిధ అవసరాల కోసం వచ్చే ప్రజలు ఆ ప్రాంతమంతా బురదమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం నడవడానికి కూడా వీలు లేకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. గత మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షం కురవడం వల్ల ఆ ప్రాంతంలో వర్షపు నీరు పోయే దారి లేకపోవడంతో నీరు నిల్వ ఉండ పోయి బురదమయంగా మారింది. దీంతో దుర్వాసన వెదజల్లుతుందని కార్యాలయాలకు వచ్చే ప్రజలు అంటున్నారు. దోమలు ఈగలు స్వర విహారం చేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో డ్రైనేజీ వ్యవస్థ రోడ్లు నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కోటనందూరులో అధ్వానంగా ఉన్న రహదారి

చేలో కుప్పకూలి కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్ (45) తాను కౌలు చేస్తున్న పంట పొలంలో కుప్పకూలి పడిపోయి మరణించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం తోటి రైతులతో కలిసి వరి చేలో ఎరువులు జల్లుతున్న శ్రీనివాస్ ఒక్కసారిగా ముందుకు కుప్పకూలి పడిపోయినట్లు తెలిపారు. వెంటనే యానాం జిజిహెచ్‌కు తరలించగా అప్పటికే శ్రీనివాస్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. కౌలు రైతు శ్రీనివాస్ కొన్నేళ్లుగా సుమారు 20 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయమే జీవనాధారంగా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వ్యవసాయం పనులు చేయడంలో శ్రీనివాస్ అందరికీ ఆదర్శంగా ఉంటాడని, తోటి కష్టజీవి చనిపోవడంతో సాటి రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేయగా మరో కుమార్తె ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. కుటుంబ యజమాని ఆకస్మికంగా మరణించడంతో ఆయన భార్య వాసంశెట్టి సుబ్బలక్ష్మి, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. తమకు దిక్కెవరిని ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

నేరాలు ఘోరాలు

బైకుతో ఆవును ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి -కరప

మండల కేంద్రమైన కరప గ్రామంలో బైకుతో ఆవును ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు బంధువులు తెలిపిన వివరాల మేరకు. ఆదివారం రాత్రి కరప గ్రామానికి చెందిన దున్నే లక్ష్మణరావు (40) బైకుపై ప్రయాణిస్తుండగా గ్రామంలో హైస్కూల్ సమీపంలో మెయిన్ రోడ్డుపై బైకుతో రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆవును ఢీకొట్టడంతో వెనక్కు పడిపోయాడు. లక్ష్మణరావు తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో కుప్పకూలిపోయి అక్కడికక్కడే మరణించాడు. ఈ ప్రమాద సంఘటన తెలుసుకున్న కరప ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఒక వికలాంగురైన కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బంధువులకు మహిళ అప్పగింత

ప్రజాశక్తి-ఆత్రేయపురం

భర్తకు చెప్పకుండా ఆత్రేయపురం వచ్చిన ఒక మహిళను పోలీసులు బంధువులకు అప్పగించారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన మాడిపూడి శిరీష భర్త వెంకటరమణ మీద అలిగి ఇంట్లో చెప్పకుండా ఆత్రేయపురం గ్రామం బండారి కాలనీలో బంధువుల ఇంటికి వచ్చింది. భర్త భార్య శిరీష కనబడడం లేదంటూ ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. ఆదివారం స్థానిక ఎస్ఐ బివి.కిరణ్ కుమార్ ఆమె బండారు కాలనీలో ఉన్నట్లు గుర్తించి బంధువులకు అప్పగించారు.

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం కోరంగి వంతెన పైనుంచి దూకి అంగాడి రాఘవేంద్ర అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ చిన్న వలస గ్రామానికి చెందిన రాఘవేంద్ర ఈనెల 28వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడు. ఈ నేపథ్యంలో అతని తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గుర్తు తెలియని యువకుని కోరంగి వంతెన పైనుంచి దూకినట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఒక మృతదేహం లభ్యం కావడంతో అతను రాఘవేంద్ర అని కుటుంబ సభ్యులు గుర్తించారు. ప్రేమలో విఫలమై ఈ ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

అతివేగంగా వచ్చిన కారు మూడు బైకులు పైనుంచి దూసుకుపోవడంతో నలుగురు వ్యక్తులకు గాయాలు అయ్యాయి. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మట్టపాలెం నుంచి కాకినాడ వైపు వస్తున్న కారు గురజనాపల్లి జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న బైకులపై నుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. సంఘటన స్థలంలో క్షతగాత్రులు, బైక్లు చెల్లాచెదురుగా పడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. తక్షణమే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను 108లో కాకినాడ జిజిహెచ్ తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కోరంగి ఎస్ఐ పి. శ్రీనివాస్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తలంకలో ఇళ్ల మధ్య వరద నీరు

లంకల్లోకి చేరిన వరద.. ప్రజల భయాందోళన..

ప్రజాశక్తి - తాళ్లరేవు

భద్రాచలం నుంచి వస్తున్న వరద నీరు తాకిడితో ధవలేశ్వరం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక ప్రకటించిన నేపథ్యంలో దిగువకు వదులుతున్న వరద నీరు లంక గ్రామాల్లోకి వేగంగా చేరుతోంది. మండలంలోని పిల్లంక పంచాయతీ కొత్తలంక గ్రామంలో ఇప్పటికే కూరగాయల తోటలు పూర్తిగా నీట మునిగాయి. గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కొత్తలంక గ్రామంలో సుమారు 100 గృహాల చెంతకు నీరు చేరింది. గ్రామంలోని పశువులను మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు. గతేడాది జూలైలో ఇదే విధంగా వరద నీరు వచ్చి గ్రామాన్ని ముంచేసిందని, గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

నీట మునిగిన గృహాలను పరిశీలిస్తున్న ఉదయ్

నిరుపేదలను ముంచిన సిఎం జగన్

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

సిఎం వైఎస్.జగన్ నిరుపేదలకు నిండా ముంచారని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. కొత్తపల్లి మండలంలో ఆదివారం ఆయన పర్యటించారు. కొమరగిరిలో జగనన్న ఇళ్ల స్థలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. సముద్రంకు అతి దగ్గరలో ఇళ్ల స్థలాలు ఇచ్చి సిఎం జగన్ పేదలను నిండా ముంచారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లేటి బాపన్న దొర, కంబాల దాసు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవగాహన ఉంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) ఎస్.భాస్కరరావు అన్నారు. సీజన్లో ప్రధానంగా మలేరియా, డెంగ్యూ వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సూచనలతో తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు.

మలేరియా, డెంగ్యూ ఎలా వ్యాపిస్తుంది. నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

డెంగ్యూ వ్యాపించే ఆడ ఎడిస్ దోమ శుభ్రమైన నీటిలో పెరుగుతుంది. ఈ దోమ కుట్టిన వారం రోజులకు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే డెంగ్యూగా పరిగణించాలి. వ్యాధిగ్రస్తులకు రక్తకణాలు (ప్లేట్‌లెట్స్) తగ్గి పరిస్థితి విషమించే ముప్పు ఉంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే డెంగ్యు సోకకుండా చూసుకోవచ్చు. ఇంటి ఆవరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పరిసరాల్లో నీరు నిలిస్తే ఆయిల్ బాల్స్ చల్లాలి. కాకినాడ జిల్లాలో 2019లో 513, 2020లో 72 కేసులు, 2021లో 496, 2022లో 523 కేసులు, ఈ ఏడాది ఇప్పటి వరకు 75 కేసులు వెలుగులోకి వచ్చాయి. అప్రమత్తంగా లేకుంటే కేసుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

ఏయే ప్రాంతాల్లో కేసులు ఎక్కువగా వస్తున్నాయి.?

గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఈ ఏడాది గొల్లప్రోలు మండలం చేబ్రోలు, కాకినాడ రూరల్ పండూరు, తూరంగి, కరప, తాళ్లరేవు, కాజులూరు మండలం గొల్లపాలెం, పెద్దాపురం మండలం కాండ్రకోట, పులిమేరు, జగ్గంపేట మండలం కాత్రావులపల్లి, గండేపల్లి, కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి, శంఖవరం, ప్రత్తిపాడు మండలం రాచపల్లి, తొండంగి, రావికంపాడు, కోటనందూరు, కాకినాడ కార్పొరేషన్ పరిధిలో కేసులు ఉన్నాయి.

వ్యాధుల పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గతేడాది ప్రతి ఇంటిలోనూ ఒకరికి వ్యాధులు సోకి ఆస్పత్రులలో చికిత్స పొందారు. ఈ ఏడాది కూడా వ్యాధుల ముప్పు పొంచి ఉన్న తరుణంలో ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇంటిలోని, చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఈ కాలంలో దోమల వద్ధి ఎక్కువగా ఉంటుంది. పరిసరాల్లో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. పూలకుండీలు, వాటర్ ట్యాంకుల్లో నీటిని శుభ్రం చేయాలి. ఇంటి చుట్టుపక్కల పాత టైర్లు, తాగి పాడేసిన కొబ్బరి బోండాలు ఉండకుండా చూసుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేయడం మంచింది.

డయేరియా రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి

కలుషిత నీటిని తాగడం, ఆహారాన్ని తినడం వల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉంటుంది. వర్షాలకు ఇంటి పరిసరాలు చిత్తడిగా మారి ఈగలు పెరుగుతాయి. ఈగలు మనం తినే ఆహార పదార్థాలపై వాలి కలుషితం చేస్తాయి. దీంతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకకుండా పరిసరాల శుభ్రతను పాటించాలి. ఇంట్లోకి ఈగలు రాకుండా జాలీ (మెష్) వంటివి ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ ఆహార పదార్థాలు, ద్రవపదార్థాలు పడేయకూడదు. వేడి పదార్థాలను తీసుకోవడం మంచింది.

వైరస్‌ల ప్రభావంతో వచ్చే జర్వాలు వాటి ప్రభావం ఎలా ఉంటుంది

వర్షాలు కురుస్తున్నందున వైరస్ ప్రభావం ఎక్కువ ఉంటుంది. దగ్గు, జలుబుతో మొదలై జ్వరం వస్తుంది. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు ఎక్కువై ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. వద్ధుల్లో శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. ఆయాసం పెరుగుతుంది. చిన్నపిల్లల్లో జ్వరం ఎక్కువగా వస్తే మూర్ఛపోయే అవకాశాలు ఉంటాయి. నిల్వ ఉన్న పదార్థాలు తినకూడదు. ఇంటి ఆవరణలో నీల్వకుండా జాగ్రత్తలు పాటించడం వల్ల వైరస్ వ్యాపించవు. కలుషితమైన నీటిని తాగడం వల్ల కూడా శరీరంలోకి వైరస్ వ్యాపిస్తుంది. స్వచ్ఛమైన నీటిని తాగాలి.

సీజన్ వ్యాధుల నివారణ కోసం చేపడుతున్న చర్యలేమిటి.?

కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నాము. క్షేత్ర స్థాయిలో పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల్లో డెంగ్యూ ర్యాపిడ్ కిట్లు అందుబాటులో ఉంచాము. డెంగీ కేసులున్న చోట 50 నుంచి 60 ఇళ్ల పరిధిలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే, యాంటీ లార్వా గాలిలో మందు పిచికారీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడంతోపాటు పిహెచ్‌సి, సిహెచ్‌సిల పరధిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకుల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేస్తున్నాము. వైద్య సిబ్బందిని, ఆంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

యానాం వార్తలు

రాజీవ్ బీచ్ వద్ద వరద ఉధృతి

ఉరకలెత్తిన గౌతమి గోదావరి

ప్రజాశక్తి - యానాం

యానాం గౌతమీ గోదావరి వరద నీటితో ఉరకలెత్తుతోంది. వరద నీటి ప్రవాహాన్ని అంచనా వేయడానికి ఆదివారం ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి సంబంధిత అధికారులతో కలిసి స్థానిక రాజీవ్ బీచ్, ఫెర్రీ రోడ్డును పరిశీలించారు. అదేవిధంగా పుష్కరఘాట్, యానాం-ఎదుర్లంక వారధి జీసస్ స్టాట్యూ వద్ద నీటి మట్టాన్ని చూశారు. రాజీవ్ పార్క్, భారత్ మాత, జీసస్ స్టాట్యూ వద్దకు వరద నీరు ప్రవేశించడంతో బీచ్ సందర్శకుల రాకపోకలు నిలిపివేశారు. పలుచోట్ల ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. కనకాలపేట లంక భూముల్లోకి వరద నీరు చేరింది. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి అధిక నీటిని విడుదల చేయడంతో స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

సీతమ్మ పేట నుంచి రామన్నకోడు మధ్య రోడ్డును కప్పేసిన తుమ్మ చెట్లు

తుమ్మ చెట్లతో ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు వైపు వెళ్లే ప్రయాణికులు సీతమ్మ పేట నుంచి రామన్నకోడు మధ్యలో ఉన్న రహదారి ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలతో వాహనాదారులు, పాదాచారులు, పాఠశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ సమీపంలో రీజెన్సీ ప్రైమరీ స్కూల్, రీజెన్సీ జూనియర్ కాలేజ్,పిజిఎన్ గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థులు ఆ రహదారి గుండా నడుచుకుంటూ వెళ్లేటప్పుడు తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు కళ్లకు తగులుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా మొక్కల్లోంచి విషసర్పాలు బయటికి రావడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. రోడ్డు సరిగ్గా కనబడక ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారులకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలు,తుమ్మ చెట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎఎస్ఐ నాగేశ్వరరావు ఉద్యోగవిరమణ

ప్రజాశక్తి - యానాం

యానాం పోలీస్ శాఖలో ఎఎస్ఐగా విధులు నిర్వహించిన రేకాడి నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ వేడుకను స్థానిక బెజవాడ గార్డెన్స్‌లో అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముందుగా విష్ణాలయం వీధి పిల్లారాయ స్వామి ఆలయం వద్ద నుంచి నాగేశ్వరరావు దంపతులను ఊరేగింపుగా తీసుకెళ్లారు. నాగేశ్వరరావు సేవలను పలువురు అభినందించారు.

ఘనంగా మద్దింశెట్టి సత్యానందం జయంతి

ప్రజాశక్తి - యానాం

మేయర్‌గా పని చేసిన మద్దింశెట్టి సత్యానందం జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్డులోని ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి ఇఇ వీర సెల్వం, ఎఇ నాగరాజు, కొల్లు ప్రసాద్, మద్దింశెట్టి జియ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ అలసత్వంపై ప్రయాణికుల ఆగ్రహం

ప్రజాశక్తి-గండేపల్లి

సీట్లు దగ్ధం చేస్తున్న ప్రయాణికులు

హైదరాబాదు నుండచి విశాఖపట్నం వెళ్తున్న ఎస్‌విఎన్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మండల కేంద్రమైన గండేపల్లి గ్రామ శివారు కరుణ కుమార్ హోటల్ వద్ద ఆగిపోవడంతో ప్రయాణికులు బస్సు సీట్లు తగలబెట్టారు. దీంతో అటుగా వస్తున్న వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. శనివారం రాత్రి 12 గంటలకు హైదరాబాదు నుంచి బయలుదేరిన బస్సు ఆదివారం ఉదయం 11 గంటలకు విశాఖపట్నం చేరాల్సి ఉండగా మార్గం మధ్యలో కోదాడ, రాజమండ్రిలో రెండుసార్లు బస్సు మరమ్మతులకు లోనయ్యింది. మరొకసారి గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై బస్సు మరమ్మతు రావడంతో ప్రయాణికులు ఆగ్రహించారు. దీంతో వారికి విశాఖపట్నం వెళ్లేందుకు రూ.300 బస్ ఛార్జీలు ఇవ్వాలని అడగడంతో డ్రైవర్, సిబ్బంది వారికి రూ.200 ఇస్తామని ఉదయం ఆఫీస్ నుండి మీకు అమౌంట్ అందజేస్తామని యాజమాన్యంతో మాట్లాడినట్లు తెలిపారు. దీంతో కొంతమంది ప్రయాణికులు ఆగ్రహానికి లోనై బస్సులో ఉన్న మూడు సీట్లు, బెడ్ సీట్లు జాతీయ రహదారిపై తగలబెట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ప్రయాణికులను సిబ్బందిని వారించి విశాఖపట్నం వెళ్ళే బస్సులో సుమారు 15 మందిని ఎక్కించారు. బస్సులో తగలబెట్టిన వస్తువుల సుమారు రూ.30 వేలు ఉంటుందని డ్రైవర్ సిబ్బంది తెలిపారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

బాలికలు లేదా మహిళలను మభ్య పెట్టడం, బెదిరించడం లేదా ప్రలోభాలకు గురి చేస్తుంటే ఆ వ్యక్తుల సమాచారాన్ని వెంటనే దగ్గరలో ఉన్న పోలీసులకు తెలియజేయాలని న్యాయవాది యనమల రామం పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ అడబాల ట్రస్ట్ కార్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అభం శుభం తెలియని బాలికలను ఎక్కువగా దళారులు ట్రాప్ చేసి ఇతర దేశాలకు అక్రమ రవాణా చేస్తున్నారని అన్నారు. విదేశాల్లో మోడల్స్, ఉద్యోగులుగా, ఇంటి పని వారిగా మహిళలకు పని కల్పిస్తామంటూ అక్రమ రవాణా చేస్తున్నారని అన్నారు. వ్యభిచార వృత్తిలోకి వారిని దింపడంతో పాటు మత్తు పదార్థాల, మారణాయుధాల అక్రమ రవాణాలో కూడా వీరిని ఉపయోగిస్తున్నారని యనమల తెలిపారు. న్యాయవాదులు బహదూర్, వసంత, ఎన్జీవో ప్రతినిధి ఫణి శ్రీ, రాజా, రాఘవరావు స్థానికులు పాల్గొన్నారు.

పేదలకు భోజనాలు అందించిన సభ్యులు

పేదలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి-తాళ్లపూడి

దేవోక్తి చిడిపి సోషల్ ఆర్గనైజేషన్ ద్వారా వివిధ ప్రాంతాలలో ఉంటున్న వందమంది రోగులకు, అనాథలకు ఆదివారం భోజనం ప్యాకెట్లు అందజేశామని ఆర్గనైజేషన్ ప్రతినిధి ప్రత్తిపాటి అబెద్నెగో తెలిపారు. తాళ్లపూడి గ్రామానికి చెందిన మంగన్న సర్జికల్ అండ్ మెటర్నిటీ నర్సింగ్ హోమ్ డాక్టర్ మూర్తి ఆర్థిక సహాయంతో కొవ్వూరు వాత్సల్య వృద్ధాశ్రమం, గోష్పాద క్షేత్రం వద్ద రాజమహేంద్రవరం రూతు వృద్ధుల ఆశ్రమం, బొమ్మూరు కుష్ఠ రోగుల ఆశ్రమం వద్ద భోజనం ప్యాకెట్లు అందజేశామనిఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అబెద్నెగోకొయ్య పాప, రాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను మహా శక్తిగా తయారు చేస్తాం

ప్రజాశక్తి-గండేపల్లి


మహిళలతో మాట్లాడుతున్న నెహ్రూ

మహిళలను మహాశక్తిగా తయారుచేసి అన్ని రంగాల్లో మహిళలను ముందుకు తీసుకువెళ్లాలని ఉన్నత ఆశయంతో టిడిపి అధినేత చంద్రబాబు మినీ మేనిఫెస్టో తీసుకొచ్చారని పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. రామయ్యపాలెంలో మహాశక్తి చైతన్య రథయాత్ర ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. మహిళలు మినీ మేనిఫెస్టోలో పొందుపరిచిన మహాశక్తి పథకాలను వివరిస్తూ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. గండేపల్లి-సింగరంపాలెం ప్రధాన రహదారి పెద్ద పెద్ద గుంతలతో ఆకు మడులను తలపించడంతో మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన్ రావు ఆధ్వర్యంలో రోడ్లపై ఆకు నూర్చి రోడ్లు వేయాలని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, పోతుల మోహనరావు, బొల్లంరెడ్డి రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య, కుంచే రామకృష్ణ వెలమాటి కాశి, పోలినాటి ధర్మానందకుమారి, శ్రీదేవి ఏలాటి అమ్మాజీ, గెద్దాడ సత్యవేణి, రాపాక లక్ష్మి, చెక్క మరియా, తిప్పన సత్యవతి, పాలచర్ల సత్యనారాయణ, బోండా శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి

ప్రజాశక్తి-గోపాలపురం

ఆపదలో ఉన్న వారికి మానవత దక్పథంతో సహాయం అందించాలని మానవతా జిల్లా అధ్యక్షులు గంగాధర్, జిల్లా విద్యా కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని చిట్యాల గ్రామంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారి సమావేశం మండల అధ్యక్షులు ముప్పన కప వరప్రసాద్ అధ్యక్షతన జరిగింది. జిల్లా అధ్యక్షులు గంగాధర్ రావు, జిల్లా విద్య కమిటీ ఛైర్మన్ అలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని గుర్తించి సహాయం అందించాలని అన్నారు. ఎదుటివారి పట్ల మానవత్వం కలిగి ఉండాలని తెలిపారు. సభ్యత్వాలు వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఛైర్మన్ రాంబాబు, కో ఛైర్మన్ నెల్లి చంద్రశేఖర్, బూసి మురళికష్ణ, రాధాకృష్ణ, కొండెపాటి రత్నాజీ, పెనుగొండ బాలాజీ, ఎలిపే నరేంద్ర, నుతంగి దొరబాబు, మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

ఎస్‌సి వర్గీకరణ చేయాలని కోరుతూ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ తాతపూడి సురేష్‌కుమార్ అధ్యక్షతన దేవరపల్లిలో నియోజవర్గ సమీక్ష సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రుద్రబోగు సురేష్ మాదిగ హాజరై మాట్లాడుతూ వర్షాకాలం పార్లమెంటు సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ఆమోదించాలని లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో మాదిగ తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్ఆర్‌పిఎస్ జిల్లా ఇన్చార్జ్ గడ్డం వినోద్ బాబు మాదిగ, విశ్వరూపం మహాసభ విజయవంతం చేయడానికి ఇన్చార్జిగా వచ్చిన పోసపల్లి వెంకట్రావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కోరంగి పంచాయతీ సీతారాంపురం గ్రామంలో డయాబెటిక్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందవికి ఈ పరీక్షలు చేసారు. ఈ కార్యక్రమంలో తాళ్ళరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చోడే శ్రీనివాస్, కట్టా ఆదినారాయణ, బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, ధూళిపూడి వెంకటరమణ (బాబి), హెల్త్ సూపర్ వైజర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు వాటర్ ఫిల్టర్ బహూకరణ

ప్రజాశక్తి-పెరవలి

వాటర్ ఫిల్టర్ మిషన్ అందజేసిన సూర్యారావు

మండలం కానూరు గ్రామంలో ఉన్న బిసి బాలికల హాస్టల్ కు కానురు గ్రామానికి చెందిన దాత ర్యాలి సూర్యారావు రూ.23 వేలు విలువ గల ప్యూర్ ఫైడ్‌వాటర్ మిషన్ ఆదివారం వైసిపి నాయకులు మిలిమి శ్రీను సమక్షంలో హాస్టల్ వార్డెన్ డి.శాంత కుమారికి అందజేశారు. బాలికలు ఫిల్టర్ అయిన మంచినీరు తాగటానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి నాయకులు మిలిమి శ్రీను, హాస్టల్ వార్డెన్ డి. శాంత కుమారి విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు :: కాకినాడ

M.V.O.P.No. 175/2021

బిట్వీన్:

చుక్కా రత్నం & అదర్స్ **...పిటీషనర్సు**

అండ్

కోట్ల శ్రీనివాసరావు అండ్ అదర్స్ **...రెస్పాండెంట్స్**

ఆర్-2: చెల్లుబోయిన కృపా జయలక్ష్మి, భర్త: ఎస్.వి.హనుమంతురావు, వయస్సు 51 సం॥లు, డో.నెం. 4-1-097, వెంకట నగర్, యానాం, పాండిచ్చేరి. (ఓనర్, హోండా ఏక్టీవా మోటార్ సైకిల్ నెం. PY 04 A 3300)

పై కేసులో 2వ రెస్పాండెంటు అయిన మీరు ఎన్ని పర్యాయములు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీ హాజరు నిమిత్తం **ది.29-08-2023వ తేదీన వాయిదా అయి ఉన్నది. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియ జేయగలరు.** లేనిచో మీ పరోక్షముగా తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.వి.భద్రరావు
కె.శ్రీవాణి,
కె.యస్.చంద్రరావు
అడ్వకేట్స్, కాకినాడ.

నగరపాలక సంస్థ - రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి.నెం.770/2022-ఎ1 **టెండరు కమ్ వేలం నోటీసు** తేది.28-07-2023

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో గల ఈ దిగువ తెలిపిన మార్కెట్లకు 2023-24 సంవత్సరమునకు స్వాధీనము చేసిన నాటి నుండి 31-03-2024 వరకు ఆశీలు వసూలు చేసుకొనే గుత్తహక్కు నిమిత్తం ది.08-08-2023వ తేదీ మధ్యాహ్నం గం॥1:00 సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. సదరు టెండరు నగరపాలక సంస్థచే ప్రకటించబడిన గజిట్ నోటీఫికేషన్ నెం.08/2023 లోని రేట్లు మరియు షరతులకు లోబడి దాఖలు చేయవలసియున్నది. టెండర్లు తెరువకుండగానే టెండరుదారుల సమక్షమున అదే రోజు సాయంత్రం గం॥4:00 లకు కమిషనరు వారు కాని వారిచే అనుమతి పొందిన అధికారి కాని వేలము నిర్వహించబడును. తదుపరి హాజరైన టెండరు దారుల సమక్షమున టెండర్లు తెరువబడును. గుత్తదారుడు వేయు టెండరు /పాట మొత్తమునకు ఛార్జీలు అదనము మరియు వాటి మొత్తముపై 18% జి.ఎస్.టి. అదనము.

వ.నెం	మార్కెట్టు పేరు	ధరావత్తు రూ.	బ్యాంకు గ్యారంటీ రెండు సంవత్సరములకు (రూ.)
1	జాంపేట మార్కెట్టు	800000	800000
2	జలపుష్ప భవనము (హోల్‌సేల్ చేపల మార్కెట్టు)	100000	100000
3	క్వారీ మార్కెట్టు	75000	75000
4	ఎం.ఎ. మార్కెట్టు	200000	200000
5	అరటిపండ్ల మార్కెట్టు	1000000	1000000

ఆసక్తి గలవారు ది.08-08-2023వ తేదీ సాయంత్రం గం॥4:00 లలోపు నగరపాలక సంస్థ ట్రజరీలో రూ.200/-లు చెల్లించిన రశీదు, ధరావత్తు సొమ్ము (కమిషనరు, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం వారి పేరున) డిమండ్ డ్రాఫ్ట్ మరియు నిర్దేశించిన సొమ్ముకు బ్యాంకు గ్యారంటీ సమర్పించి టెండరు షెడ్యూల్ పొందవచ్చును. ఏ కారణము తెలుపకయే టెండర్లు గాని, వేలము గాని వాయిదా వేయుటకు లేదా రద్దుపరచుటకు నగరపాలక సంస్థ, కమిషనరు వారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో రెవెన్యూ ఆఫీసరు-1 గారిని సంప్రదించవచ్చును.

షరతులు: 1) వేలము నందు పాల్గొనదలచిన వారు తమ ఫోటో మరియు సంతకముతో కూడిన గుర్తింపు కార్డు అందచేసి వేలం నందు పాల్గొనవలెను. ఇతరులకు ఆథరైజేషన్ ఇచ్చుట అనివార్యమైనప్పుడు అట్టి ఆథరైజేషను నోటరీ అఫిడవిట్ ద్వారా (ఫోటో, పూర్తి చిరునామాతో సహా) సమర్పించవలెను. లేనిచో పాటదారులు మాత్రమే వేలములో పాల్గొనవలెను. ఇతరులు ఎవ్వరికీ అనుమతి లేదు.
2) టెండరు దాఖలు చేసిన వారు మాత్రమే వేలమునకు అనుమతించబడును.
3) వేలం ఖాయపరచిన తదుపరి గుత్తదారుడు 3 పోస్టుడేట్స్ చెక్కులు సమర్పించవలెను.
4) వేలం ఖాయపరిచిన 7 రోజులలో గుత్తదారుడు తమ సంత ఖర్చులతో లీజు కాలమునకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నందు రిజిస్ట్రేషన్ చేసుకొనవలెను. లేనిచో గుత్తేదారుని ధరావత్తు జమచేసుకొని లీజు రద్దు చేయబడును.
5) పై షరతులకు లోబడి బ్యాంకు గ్యారంటీ, లీజు కాలము రిజిస్ట్రేషన్ మరియు 6 నెలల అడ్వాన్సు సమర్పించిన తరువాత మాత్రమే ఆశీలు వసూలు చేసుకొనుటకు అనుమతించబడును.
6) పాట మరియు చార్జీల మొత్తమునకు జి.ఎస్.టి. 18% అదనము (కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వల నిబంధనల ప్రకారము)
7) గతములో పాడుకొని కోర్టు కేసులు ఉన్న వారు మరియు నరగపాలక సంస్థకు ఏవిధమైన బకాయిలు ఉన్న వారు పాటలో పాల్గొనుటకు అనర్హులు.

సం/- **కె.దినేష్ కుమార్, ఐ.ఎ.ఎస్.,** కమిషనరు, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం